




WWW.VIJAYAKERATAM.COM

RNI: APTEL/2010/34724

తెలుగు దినపత్రిక

# విజయకెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY








అక్టోబర్ 31 శనివారం 2026 | సంపుటి : 18 | సంచిక : 265 | పేజీలు : 4 | వెల రూ. 1.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

SATURDAY OCTOBER 31 2026 | VOL:18 | ISSUE: 265 | PAGES:4 | Rs. 1:00 | EDITOR:MD. MaKsood Ahmed


## రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూములను కాపాడాం: సీఎం రేవంత్ రెడ్డి

**మియాపూర్‌లో 550 ఎకరాలపై సుప్రీంకోర్టు తీర్పు**

**భూముల విలువ రూ.50 వేల కోట్లు అని సీఎం వెల్లడి**

**రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూములు కాపాడినట్లు ప్రకటన**

**భూముల విక్రయ నిధులతో అభివృద్ధి పనుల ప్రతిపాదన**



మియాపూర్‌లో 550 ఎకరాల భూమిపై సుప్రీంకోర్టు తీర్పు తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా రావడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ భూముల పరిరక్షణ, గతంలో జరిగిన భూ లావాదేవీలపై మాట్లాడారు.

(మిగతా 2వ పేజీలో..)

## మూసీ ప్రక్షాళనకు మేము వ్యతిరేకం కాదు: రాంచందర్ రావు



**గాంధీ సరోవరం పేరిట పేదల ఇళ్లు కూల్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్న రాంచందర్ రావు**

**కాంగ్రెస్ పార్టీ తమపై తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపణ**

**విపక్షాల 'మాక్ పార్లమెంట్' ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని విమర్శ**

మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టును బీజేపీ అడ్డుకుంటోందని కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని తెలంగాణ బీజేపీ

(మిగతా 2వ పేజీలో..)

## హైదరాబాద్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆకాశ్ ను ఖరారు చేసిన కల్వకుంట్ల కవిత



**గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో తెలంగాణ రక్షణ సేన**

**హైదరాబాద్ అభ్యర్థిగా సీనియర్ జర్నలిస్ట్ ఆకాశ్ కొల్లూరు ఖరారు**

**వరంగల్, హైదరాబాద్ రెండు స్థానాల్లోనూ బీసీలకే అవకాశం**

**ఎన్నికల పరిశీలకుడిగా డాక్టర్ చిట్నేని రఘు నియామకం**

రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల

(మిగతా 2వ పేజీలో..)




విజయకేరళం
తెలుగు దినపత్రిక

## సం పా దకీయం

# విద్యుత్ పొదుపు.. భవిష్యత్తుకు వెలుగుబాట!

ఆధునిక ప్రపంచంలో విద్యుత్ లేకుండా ఒక్కరోజు గడపడం కూడా కష్టమే. గృహావసరాల నుంచి పరిశ్రమల వరకు, వ్యవసాయం నుంచి వైద్య రంగం వరకు ప్రతి కార్యకలాపానికి విద్యుత్ అత్యవసరంగా మారింది. సాంకేతిక అభివృద్ధి, పట్టణీకరణ, జనాభా పెరుగుదలతో విద్యుత్ వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. అయితే అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి పెంచడమే కాకుండా, అందుబాటులో ఉన్న విద్యుత్‌ను పొదుపుగా వినియోగించడం కూడా అంతే ముఖ్యం. విద్యుత్‌ను వృథా చేయడం అంటే కేవలం బిల్లులు పెంచుకోవడం కాదు.. విలువైన ఇంధన వనరులను వృథా చేయడమే.

అవసరానికి మించి వినియోగం వద్దు

ఇళ్లలో అవసరం లేకున్నా లైట్లు, ఫ్యాన్లు, విద్యుత్ పరికరాలు పనిచేస్తూనే ఉండటం సాధారణంగా కనిపిస్తుంది. కార్యాలయాలు, దుకాణాలు, వాణిజ్య సముదాయాల్లో కూడా విద్యుత్ వినియోగంపై తగిన నియంత్రణ ఉండటం లేదు. చిన్న నిర్లక్ష్యాలు కలిసినప్పుడు పెద్ద మొత్తంలో విద్యుత్ వృథా అవుతుంది. అవసరమైనప్పుడు మాత్రమే పరికరాలను ఉపయోగించడం, ఉపయోగం పూర్తయిన వెంటనే స్విచ్‌లు నిలిపివేయడం వంటి చిన్న అలవాట్లు కూడా గణనీయమైన పొదుపునకు దోహదం చేస్తాయి.విద్యుత్ పొదుపు బాధ్యత కేవలం గృహ వినియోగదారులకే పరిమితం కాకూడదు. పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు కూడా ఇంధన సామర్థ్యం పెంచే విధానాలను అనుసరించాలి. తక్కువ విద్యుత్‌తో ఎక్కువ ప్రయోజనం అందించే పరికరాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

పునరుత్పాదక ఇంధన వనరులే భవిష్యత్తు

బొగ్గు, పెట్రోలియం వంటి సంప్రదాయ ఇంధన వనరులపై అధికంగా ఆధారపడటం వల్ల పర్యావరణంపై ఒత్తిడి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో సౌరశక్తి, పవన విద్యుత్ వంటి పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని విస్తరించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా సౌర విద్యుత్ ఉత్పత్తికి అనుకూలమైన ప్రాంతాల్లో ఇళ్ల పైకప్పులు, ప్రభుత్వ భవనాలు, విద్యాసంస్థల్లో సౌర ఫలకాలను ఏర్పాటు చేయడాన్ని ప్రోత్సహించాలి. అయితే పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి పెరగడం ఒక్కటే సమస్యకు పూర్తి పరిష్కారం కాదు. ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను నిల్వ చేయడం, అవసరమైన ప్రాంతాలకు సరఫరా చేయడం, విద్యుత్ పంపిణీ వ్యవస్థలో నష్టాలను తగ్గించడం కూడా ముఖ్యం. దీర్ఘకాలిక ప్రణాళికతో ఉత్పత్తి, నిల్వ, పంపిణీ వ్యవస్థలను బలోపేతం చేయాలి.

వ్యవసాయ రంగంలో సమర్థ వినియోగం

వ్యవసాయ రంగానికి విద్యుత్ అత్యంత కీలకం. సాగునీటి పంపులు, ఇతర వ్యవసాయ పరికరాలకు విద్యుత్ అవసరం. అయితే పాతకాలపు మోటార్లు, లోపభూయిష్ట విద్యుత్ పరికరాల వల్ల అధిక విద్యుత్ వినియోగం జరుగుతోంది. రైతులకు మెరుగైన సామర్థ్యం కలిగిన మోటార్లు, ఆధునిక సాగునీటి పద్ధతులపై అవగాహన కల్పించాలి.సూక్ష్మ సేద్యం, నీటి సమర్థ వినియోగం, పంటకు అవసరమైనంత నీటిని మాత్రమే అందించే పద్ధతులను ప్రోత్సహించాలి. రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడంతో పాటు వ్యవసాయ విద్యుత్ వ్యవస్థలో సాంకేతిక నష్టాలను తగ్గించేందుకు చర్యలు చేపట్టాలి.

విద్యుత్ ఆదాతో కుటుంబానికి ఆర్థిక భరోసా

విద్యుత్ పొదుపు వల్ల పర్యావరణ ప్రయోజనాలతో పాటు కుటుంబాలపై ఆర్థిక భారం కూడా తగ్గుతుంది. తక్కువ విద్యుత్ వినియోగం వల్ల నెలవారీ బిల్లులు తగ్గుతాయి. గృహాల్లో విద్యుత్ సామర్థ్యం కలిగిన పరికరాలను ఉపయోగించడం, ఎల్ఈడీ దీపాలకు ప్రాధాన్యం ఇవ్వడం, పగటిపూట సహజ వెలుతురును వినియోగించడం వంటి చర్యలు ప్రయోజనకరంగా ఉంటాయి. కొత్త ఇళ్లు నిర్మించేటప్పుడు సహజ గాలి, వెలుతురు వచ్చేలా రూపకల్పన చేయాలి. భవనాల్లో విద్యుత్ వినియోగాన్ని తగ్గించే నిర్మాణ పద్ధతులను ప్రోత్సహించాలి. విద్యుత్ పొదుపును ఖర్చు తగ్గించే చర్యగా మాత్రమే కాకుండా పర్యావరణ పరిరక్షణలో భాగంగా చూడాలి.

ప్రజల్లో అవగాహన పెంచాలి

విద్యుత్ పొదుపు గురించి ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం మాత్రమే సరిపోదు. ప్రజలు రోజువారీ జీవితంలో ఆచరించేలా అవగాహన కల్పించాలి. పాఠశాలలు, కళాశాలల్లో విద్యుత్ వినియోగం, ఇంధన వనరుల పరిరక్షణపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలి. విద్యార్థుల ద్వారా కుటుంబాలకు కూడా పొదుపు అలవాట్లను చేరవేయవచ్చు.ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, స్థానిక సంస్థలు తమ విద్యుత్ వినియోగాన్ని సమీక్షించాలి. అవసరం లేని పరికరాల వినియోగాన్ని తగ్గించి, ఇంధన సామర్థ్యాన్ని పెంచే చర్యలు చేపట్టాలి. ప్రభుత్వమే ఆదర్శంగా నిలిస్తే ప్రజల్లోనూ బాధ్యతాయుతమైన వినియోగం పెరుగుతుంది.

విద్యుత్ రంగంలో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి అవసరం

పెరుగుతున్న విద్యుత్ అవసరాలను అంచనా వేసి ముందుగానే ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవాలి. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా పంపిణీ వ్యవస్థను ఆధునీకరించాలి. పాత విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర పరికరాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. విద్యుత్ చౌర్యం, సాంకేతిక నష్టాలను తగ్గించేందుకు ఆధునిక పర్యవేక్షణ వ్యవస్థలు అవసరం. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడం ప్రభుత్వ బాధ్యత. అదే సమయంలో వినియోగదారులు కూడా విద్యుత్‌ను బాధ్యతాయుతంగా ఉపయోగించాలి. ఉత్పత్తి పెంపు, పొదుపు, పునరుత్పాదక ఇంధన వినియోగం.. ఈ మూడింటికీ సమాన ప్రాధాన్యం ఇచ్చినప్పుడే విద్యుత్ రంగం స్థిరంగా అభివృద్ధి చెందుతుంది.

నేటి పొదుపే రేపటి భద్రత

విద్యుత్ అనేది అపరిమితంగా లభించే వనరు కాదు. దాని ఉత్పత్తికి అవసరమైన ఇంధనం, నీరు, భూమి, ఇతర సహజ వనరులను సమర్థంగా వినియోగించుకోవాలి. నేటి తరానికి అవసరమైన విద్యుత్ అందించడంతో పాటు భావితరాలకు పర్యావరణహితమైన ఇంధన వ్యవస్థను అందించడం కూడా మన బాధ్యత. విద్యుత్‌ను పొదుపు చేయడం అంటే చీకటిని ఆహ్వానించడం కాదు.. భవిష్యత్తుకు మరింత వెలుగును అందించడం. ప్రతి ఇంట్లో చిన్న మార్పు, ప్రతి కార్యాలయంలో బాధ్యతాయుత వినియోగం, ప్రతి పరిశ్రమలో ఇంధన సామర్థ్యం పెరిగినప్పుడే పెద్ద ఫలితం సాధ్యమవుతుంది. ప్రభుత్వ ప్రణాళికలు, ఆధునిక సాంకేతికత, ప్రజల సహకారం కలిసినప్పుడే విద్యుత్ భద్రత సాధ్యమవుతుంది. విద్యుత్‌ను వృథా చేయకుండా వినియోగించడం నేటి అవసరం మాత్రమే కాదు.. రేపటి తరాల పట్ల మన బాధ్యత కూడా!

# రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూములను కాపాడాం: సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడినట్లు తెలిపారు. మియాపూర్ భూముల విలువ సుమారు రూ.50 వేల కోట్లు ఉంటుందని పేర్కొన్నారు.మియాపూర్ భూముల వ్యవహారంలో మాజీ సీఎం కేసీఆర్, ఆయన బంధువు దామోదర్‌రావు, గోల్డ్‌స్టోన్ ప్రసాద్‌పై రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేశారు. ఈ భూ లావాదేవీల్లో లగ్జరీ కార్లు లంచంగా ఇచ్చారని, నగదు రూపంలో ముడుపులు అందాయని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా, ఎంపీగా, టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచే ఈ వ్యవహారంపై పోరాడుతున్నట్లు చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో మియాపూర్ భూముల పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ఐఎంజీ భూములు, కంచ గచ్చిబౌలి, మామిడిపల్లి, గుర్రంగూడ అటవీ భూములు, మంచిరేవులలోని 143 ఎకరాలు సహా పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను కాపాడినట్లు సీఎం వివరించారు. ఈ వ్యవహారాల్లో కేటీఆర్, బీఆర్ఎస్ నేతల ప్రమేయం ఉందంటూ ఆరోపణలు చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 400 ఎకరాల అటవీ భూమి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భూముల అంశాలనూ ప్రస్తావించారు. పద్మాలయ స్టూడియోస్, లాంకో భూముల కేసులను అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు పరిష్కరించలేదని కేసీఆర్, హరీశ్‌రావును ప్రశ్నించారు. హరీశ్‌రావు మామ హన్మంతరావుపై కూడా ప్రభుత్వ భూమి ఆక్రమణ ఆరోపణలు చేశారు. ఇవన్నీ ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలే. ప్రభుత్వ భూములను విక్రయించి వచ్చిన నిధులను విద్య, సాగునీరు, వైద్యం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించే ఆలోచనలో ఉన్నట్లు రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ ప్రతిపాదనను రాష్ట్ర మంత్రివర్గం ముందుకు తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. వనరుల సమీకరణ కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం భూముల విక్రయ ప్రతిపాదనలను పరిశీలించి, ఆ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తిస్తుందని తెలిపారు. మియాపూర్ తీర్పుపై కేసీఆర్, కేటీఆర్ స్పందించాలని, అసెంబ్లీ వేదికగా బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

# మూసీ ప్రక్షాళనకు మేము వ్యతిరేకం కాదు: రాంచందర్ రావు

మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షుడు రాంచందర్ రావు మండిపడ్డారు. మూసీ ప్రక్షాళనను తమ పార్టీ వ్యతిరేకించడం లేదని, అయితే 'గాంధీ సరోవరం' పేరిట పేదల ఇళ్లను కూల్చివేయడాన్ని మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఈరోజు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాంచందర్ రావు మాట్లాడారు. పేదల ఇళ్లకు ఎలాంటి నష్టం జరగకుండా మూసీని శుభ్రపరిచే ప్రణాళికలు ప్రభుత్వం సిద్ధం చేయాలని సూచించారు. ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు ఇవ్వడానికి నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం, మూసీ ప్రక్షాళన పేరుతో వేల కోట్లు ఖర్చు చేయడానికి సిద్ధమవ్వడం విచిత్రంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు ఇంత పెద్ద మొత్తంలో నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయని ఆయన ప్రశ్నించారు. ఢిల్లీలో విపక్షాలు తలపెట్టిన 'మాక్ పార్లమెంట్'పైనా రాంచందర్ రావు తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ నేతలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో యూపీఏ హయాంలో ములాయం సింగ్ యాదవ్ నాయకత్వంలో మాక్ పార్లమెంట్ నిర్వహిస్తే, దాన్ని ఎందుకు నిర్వహిస్తున్నారని సోనియా గాంధీ ప్రశ్నించిన విషయాన్ని గుర్తు చేశారు. పార్లమెంట్‌ను ప్రజాస్వామ్య దేవాలయంగా అభివర్ణించిన కాంగ్రెస్ నేత, మాజీ స్పీకర్ మీరా కుమార్ విషయాన్ని ప్రస్తావిస్తూ... ఇప్పుడు అదే కాంగ్రెస్ నేతలు రాజకీయ స్వలాభం కోసం ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

# హైదరాబాద్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆకాశ్ ను ఖరారు చేసిన కల్వకుంట్ల కవిత

మొదటి పేజీ తరువాయి)

కోసం తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధినేత్రి కల్వకుంట్ల కవిత తమ పార్టీ అభ్యర్థులను ఖరారు చేశారు. హైదరాబాద్ – రంగారెడ్డి – మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పార్టీ అభ్యర్థిగా ప్రముఖ జర్నలిస్ట్ ఆకాశ్ కొల్లూరు పేరును ప్రకటించారు.సుమారు 20 ఏళ్లుగా జాతీయ మీడియా రంగంలో పనిచేస్తున్న ఆకాశ్ కొల్లూరు... ఇండియాటుడే, రిపబ్లిక్ టీవీ, సీఎన్ఎన్ న్యూస్ 18, డైలీ హంట్ వంటి సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో పాఠశాల విద్యను, ఉస్మానియా యూనివర్సిటీ నుంచి గోల్డ్ మెడల్‌తో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. విద్యావంతుడు, జాతీయ మీడియా అనుభవం ఉన్న బీసీ నేత కావడంతో పట్టభద్రుల మద్దతు తమకే లభిస్తుందని టీఆర్ఎస్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే వరంగల్ – ఖమ్మం – నల్గొండ స్థానం నుంచి బీసీ వర్గానికి చెందిన నలమాస శ్రీకాంత్ గౌడ్‌ను టీఆర్ఎస్ బరిలో దింపిన సంగతి తెలిసిందే. తాజా ప్రకటనతో రెండు ఎమ్మెల్సీ స్థానాల్లోనూ బీసీలనే నిలబెట్టినట్లయింది. ఈ ఎన్నికల కోసం హైదరాబాద్ స్థానానికి అబ్జర్వర్‌గా డాక్టర్ చిట్నేని రఘును... రెండు నియోజకవర్గాల ఎన్నికల వ్యూహాలు, వార్ రూమ్ ఇన్‌చార్జ్‌గా న్యాయవాది రామ్ కల్యాణ్ చల్లాను నియమిస్తూ కవిత నిర్ణయం తీసుకున్నారు.

# బ్యాంకులను కాంగ్రెస్ సొంత సంస్థల్లా వాడుకుంది.. ఐడీబీఐ వాటాల విక్రయంపై రాహుల్‌కు నిర్మలా కౌంటర్

- ఐడీబీఐ వాటాల విక్రయాన్ని సమర్థించిన నిర్మలా సీతారామన్
- కాంగ్రెస్ హయాంలో రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని ఆరోపణ
- మొండి బకాయిలపై గత ప్రభుత్వాలను విమర్శించిన మంత్రి
- రూ.25 వేల కోట్లకు పైగా మూలధన సాయం చేశామని వెల్లడి
- విక్రయ ప్రక్రియలో నిబంధనలు పాటించామని స్పష్టీకరణ

ఐడీబీఐ బ్యాంకులో మెజారిటీ వాటా విక్రయించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్థించారు. ఈ విక్రయంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన విమర్శలకు ఆమె స్పందించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు బ్యాంకులపై రాజకీయ ఒత్తిళ్లు తెచ్చి, నిబంధనలకు విరుద్ధంగా రుణాలు ఇప్పించాయని ఆరోపించారు. వాటి ఫలితంగానే ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో భారీగా మొండి బకాయిలు పేరుకుపోయాయని విమర్శించారు.బ్యాంకులు, ఆర్థిక సంస్థలను కాంగ్రెస్ నేతలు తమ సొంత సంస్థల్లా వాడుకున్నారని నిర్మలా సీతారామన్ ఎక్స్‌లో పేర్కొన్నారు. తమకు నచ్చిన సంస్థలకు రుణాలు ఇవ్వాలని బ్యాంకు ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. 1976లో ఇందిరా గాంధీ ప్రభుత్వం.. సంజయ్ గాంధీ వర్గానికి సంబంధమున్న సంస్థకు రుణాల విషయంలో రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గని ఎస్‌బీఐ చైర్మన్ ఆర్.కె. తల్వార్‌ను పదవి నుంచి తొలగించిందని గుర్తుచేశారు. మారుతి సంస్థకు రుణాల విషయంలోనూ 'సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా'పై సంజయ్ గాంధీ ఒత్తిడి తెచ్చారని ఆమె ఆరోపించారు.ఐడీబీఐ బ్యాంక్ గతంలో తీవ్ర సమస్యల్లో కూరుకుపోయిందని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. వీడియోకాన్, విన్‌సమ్, ఏబీజీ షిప్‌యార్డ్, కింగ్‌ఫిషర్ వంటి పెద్ద సంస్థలకు ఇచ్చిన రుణాలు మొండి బకాయిలుగా మారి బ్యాంకుకు భారీ నష్టాలు తెచ్చాయని తెలిపారు. ఈ సంస్థలకు కాంగ్రెస్ నేతలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం వృత్తిపరమైన నిర్వహణ, జాగ్రత్తతో కూడిన రుణ విధానాలు, రూ.25 వేల కోట్లకు పైగా మూలధన సాయం ద్వారా బ్యాంకును తిరిగి గాడిలో పెట్టిందని చెప్పారు. ఐడీబీఐ పునర్వ్యవస్థీకరణలో అన్ని నిబంధనలను పాటించామని స్పష్టం చేశారు. 2024 ఫిబ్రవరిలో కేంద్రం విడుదల చేసిన భారత ఆర్థిక వ్యవస్థపై శ్వేతపత్రంలో గత ప్రభుత్వాల హయాంలో చోటుచేసుకున్న ఆర్థిక అవకతవకల వివరాలు ఉన్నాయని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో.. పలుకుబడి ఉన్నవారికి ఒక రకంగా, సామాన్యులకు మరో రకంగా బ్యాంకింగ్ సేవలు అందేవని విమర్శించారు. ఈ నెల 14న ఐడీబీఐ బ్యాంకులో 60.72 శాతం వాటాను కెనడాకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్‌కు సుమారు రూ.53 వేల కోట్లకు విక్రయించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఇది భారత బ్యాంకింగ్ రంగంలో అతిపెద్ద విదేశీ పెట్టుబడిగా నిలవనుంది. ఈ నిర్ణయాన్ని రాహుల్ గాంధీ విమర్శిస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వాలు బ్యాంకులను ఏర్పాటు చేస్తే, మోదీ ప్రభుత్వం వాటిని విక్రయిస్తోందని వ్యాఖ్యానించారు. ఐడీబీఐ ఉద్యోగులకు అండగా ఉంటానని ఆయన తెలిపారు.



విజయ కెరటం
తెలుగు దినపత్రిక



# నల్లగొండ అభివృద్ధికి రూ.2 వేల కోట్లతో పనులు..
# ఏడాదిలో నగర రూపురేఖలు మారుస్తాం






- **సాగర్ రోడ్డులో రూ.20 కోట్లతో ఆరు లైన్ల రోడ్డు విస్తరణకు శంకుస్థాపన -- మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి**

**నల్లగొండ, అక్టోబర్ 30 (విజయ కెరటం):**

నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పార్టీలకతీతంగా అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.శుక్రవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు సాగర్ రోడ్డులోని వైఎస్సార్ విగ్రహం నుంచి చర్లగౌరారం రోడ్డు వరకు సుమారు మూడున్నర కిలోమీటర్ల మేర ఆరు లైన్ల రోడ్డు విస్తరణ పనులకు స్థానిక కార్పొరేటర్, పార్టీ నాయకులతో కలిసి మేయర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ రహదారిపై ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ఇటీవల పరిశీలించి, డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లగానే స్పందించి రూ.20 కోట్ల నిధులు మంజూరు చేశారని వెల్లడించారు.ఇప్పటికే నగరంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, పానగల్ ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధికి రూ.20 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. పానగల్ నుంచి డీఈఓ కార్యాలయం వరకు రోడ్డు విస్తరణతో పాటు బ్రహ్మంగారి గుట్ట, లతీఫ్ సాబ్ గుట్టలకు ఘాట్ రోడ్ల నిర్మాణం చేపట్టి పర్యాటక, ఆధ్యాత్మిక రంగాలను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. అన్ని డివిజన్లలో సమానంగా అభివృద్ధి పనులు చేపడతామని స్పష్టం చేశారు. నిధులు మంజూరు చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి మేయర్ కృతజ్ఞతలు తెలిపారు.మాజీ జెడ్పీటీసీ గుమ్ముల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. మంత్రి సహకారంతో నల్లగొండ పట్టణంలో సుమారు రూ.2 వేల కోట్లతో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఏడాది కాలంలో నగర రూపురేఖలు మారుతాయని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులు జరుగుతున్నప్పటికీ ప్రతిపక్షాలు సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారాలు చేస్తున్నాయని విమర్శించారు. ప్రజావిశ్వాసం కోల్పోయిన ప్రతిపక్షాల ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ మహమ్మద్ అఫ్రోజ్ అలీ అమీర్, మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, స్థానిక కార్పొరేటర్ పాలకూరి సుమలత సంతోష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్ యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, పలువురు కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల పోరుకు బీఎస్పీ బాసట

**హెల్త్ కార్డులేవి.. ఉద్యోగ భద్రత ఏదీ? ప్రభుత్వాన్ని నిలదీసిన బీఎస్పీ నేతలు**

**వరంగల్ విజయ కెరటం అక్టోబర్ 30:**

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించి, వారికి హెల్త్ కార్డులు జారీ చేయడంతో పాటు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని బీఎస్పీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు వనం మహేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి వైద్య సేవలందిస్తున్న ఉద్యోగులకు కనీసం ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత కల్పించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.వరంగల్‌లోని పోచమ్మ మైదాన్ సెంటర్‌లో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు చేపట్టిన ధర్నాకు శుక్రవారం బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు సంఘీభావం తెలిపి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వనం మహేందర్ మాట్లాడుతూ.. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం తగదన్నారు. హామీలతో సరిపెట్టకుండా తక్షణమే హెల్త్ కార్డులు జారీ చేసి, ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ప్రజారోగ్యం కోసం పనిచేసే ఉద్యోగులే తమ హక్కుల కోసం రోడ్లపైకి రావాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరమన్నారు.బీఎస్పీ అధికారంలోకి వస్తే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఉద్యోగులు తమ హక్కుల కోసం ధర్నాలు, రాస్తారోకోలు చేసే పరిస్థితి ఉండదని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల




పరిష్కారానికి తమ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ పార్లమెంట్ ఇన్‌చార్జి బస్కె నాగరాజు, వరంగల్ తూర్పు నియోజకవర్గ అధ్యక్షుడు జన్ను అనిల్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు వసుకుల ప్రవీణ్, జిల్లా కోశాధికారి పూలేపాక లోకేష్, జిల్లా కార్యదర్శి ఆకులపల్లి బాబు, చింత శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి నిర్మూలనకు ఎఫ్‌సీఐ ఉద్యోగుల ప్రతిజ్ఞ

- **నిజాయితీ, పారదర్శకతతో విధులు నిర్వహించాలి: డివిజనల్ మేనేజర్ నేత్ర ప్రకాష్**

**వరంగల్, విజయ కెరటం అక్టోబర్ 30:.**

ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని ఎఫ్‌సీఐ వరంగల్ డివిజనల్ మేనేజర్ నేత్ర ప్రకాష్ పిలుపునిచ్చారు.హనుమకొండ జిల్లా కాజీపేటలోని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) కార్యాలయంలో శుక్రవారం 2026 విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డివిజనల్ మేనేజర్ నేత్ర ప్రకాష్ మాట్లాడుతూ, న్యూఢిల్లీలోని ఎఫ్‌సీఐ ప్రధాన కార్యాలయం నుంచి అందిన ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎఫ్‌సీఐ అధికారులు, మేనేజర్లు, ఉద్యోగులు, సిబ్బంది విజిలెన్స్ ప్రతిజ్ఞ చేశారు. విధుల నిర్వహణలో నిజాయితీ, పారదర్శకత, జవాబుదారీతనానికి పెద్దపీట వేస్తామని, అవినీతికి తావులేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తామని ప్రతిజ్ఞ చేశారు.ప్రతి ఉద్యోగి నైతిక విలువలకు కట్టుబడి పనిచేస్తూ సంస్థ అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని నేత్ర ప్రకాష్ సూచించారు.



అవినీతి రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎఫ్‌సీఐ మేనేజర్లు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# హాలియా పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

- **పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి.. నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి**

**నల్గొండ, అక్టోబర్ 30 (విజయ కెరటం):**




హాలియా పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, సిబ్బంది పనితీరు, స్టేషన్ నిర్వహణ, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. ఫిర్యాదుదారులకు అందుతున్న సేవలు, వారి సమస్యలపై సిబ్బంది స్పందిస్తున్న తీరును సమీక్షించారు.పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, నిర్ణీత గడువులోగా దర్యాప్తు పూర్తి చేసి నిందితులకు శిక్ష పడేలా పటిష్ట ఆధారాలు సేకరించాలని ఎస్పీ సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేయడంతో పాటు వాహనాల తనిఖీలు నిర్వహించి దొంగతనాలు, ఇతర నేరాలను అరికట్టాలని తెలిపారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో స్నేహపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను ఓపికగా విని చట్టపరిధిలో పరిష్కరించాలని సూచించారు. గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, పోలీసులపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా విధులు నిర్వహించాలని తెలిపారు. పోలీస్ సిబ్బంది క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ అంకితభావంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ ఆదేశించారు.ఈ తనిఖీలో మిర్యాలగూడ ఇన్‌చార్జి డీఎస్పీ రవి, హాలియా సీఐ రాఘవరావు, ఎస్ఐ సాయి ప్రశాంత్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## పోలీస్ శాఖలో ముగ్గురికి ఘనంగా వీడ్కోలు

- **పదవీ విరమణ చేసిన పోలీస్ అధికారులను సన్మానించిన ఎస్పీ శరత్ చంద్ర పవార్**

**నల్గొండ, అక్టోబర్ 30 (విజయ కెరటం):**




పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం పాటు అంకితభావంతో సేవలందించి పదవీ విరమణ పొందిన ముగ్గురు పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఘనంగా సన్మానించి అభినందించారు. శుక్రవారం నల్గొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మిర్యాలగూడ టూ టౌన్ ఎస్ఐ చింతల రమేష్, నల్గొండ రూరల్ ఏఎస్ఐ శంకర్ రాజు, కొండమల్లేపల్లి హెడ్ కానిస్టేబుల్ వై. రామలింగయ్యలను సత్కరించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో పనిచేయడం కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం అంకితభావంతో పనిచేయాల్సిన బాధ్యత అని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ క్రమశిక్షణ, నిబద్ధతతో ప్రజలకు సేవలందించి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకువచ్చారని కొనియాడారు.పదవీ విరమణ ఉద్యోగ జీవితానికి ముగింపు మాత్రమేనని, కొత్త జీవితానికి ప్రారంభమని అన్నారు. ఇకపై కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా, ప్రశాంతమైన జీవితం గడపాలని ఆకాంక్షించారు. తమ అనుభవాలను అవసరమైన సందర్భాల్లో ఇతరులకు పంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఓ శివప్రసాద్, ఆర్ఐ సంతోష్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు సైదులు, ఉపాధ్యక్షుడు, సీఐ కరుణాకర్‌తో పాటు పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని పదవీ విరమణ పొందిన వారికి శుభాకాంక్షలు తెలిపారు.

## డ్రగ్స్ మత్తులో యువత.. పోలీసుల ఉక్కుపాదం!

- **107 మందికి పరీక్షలు.. 29 మందికి పాజిటివ్**

**వరంగల్, విజయ కెరటం అక్టోబర్ 30:**



నేరరహిత వరంగల్.. డ్రగ్స్ రహిత సమాజమే మా లక్ష్యం. యువత మత్తు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువు, జీవిత లక్ష్యాలపై దృష్టి సారించాలి" అని నగర పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత అన్నారు.నగరంలో డ్రగ్స్ వినియోగం, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణే లక్ష్యంగా వరంగల్ పోలీసులు మరోసారి ఉక్కుపాదం మోపారు. గురువారం తెల్లవారుజామున సెంట్రల్ జోన్ పరిధిలోని ఆటోనగర్, కరీమాబాద్, కాశిబుగ్గ, శంభునిపేట, శివనగర్, ఎల్‌బీనగర్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ప్రత్యేక తనిఖీల్లో మొత్తం 107 మందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా, 29 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది.గతంలో డ్రగ్స్ కేసులతో సంబంధం ఉన్నవారు, రౌడీషీటర్లు, పాత నేరస్థులు, అనుమానితులపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. తనిఖీల్లో సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 17 ద్విచక్ర వాహనాలు, రెండు కార్లు, మూడు ఎలక్ట్రిక్ మోటార్ పంపులను స్వాధీనం చేసుకున్నారు. అలాగే పిటా చట్టం కింద ఒక కేసు నమోదు చేశారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. డ్రగ్స్ వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేయడమే కాకుండా సమాజ భద్రతకు ముప్పుగా పరిణమిస్తోందన్నారు. డ్రగ్స్ సరఫరా, విక్రయాలు, రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మత్తుకు బానిసైన వారిని గుర్తించి కౌన్సెలింగ్, అవసరమైన చికిత్స అందించేలా చర్యలు చేపడతామని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి విద్య, ఉపాధి, జీవిత లక్ష్యాలపై దృష్టి సారించాలని సూచించారు.తనిఖీల్లో భాగంగా ఆయా కాలనీల ప్రజలతో పోలీసులు మాట్లాడి కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. డ్రగ్స్ వినియోగం, విక్రయాలు లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలపై డయల్ 100, 112కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.డ్రగ్స్ నియంత్రణ, నేరాల కట్టడికి ఇటువంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏసీపీ నరసింహారావుతో పాటు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్,ఎన్. కరుణాకర్ రావు, ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్‌ఎమ్. ఎ. షుకూర్,మిల్స్ కాలనీ ఇన్‌స్పెక్టర్ కర్రె స్వామి , మడికొండ పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్ప్. కిషన్, ఐటీ కోర్ సిబ్బంది, సబ్ ఇన్స్పెక్టర్లు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## ఐడీ కోసం రిటైర్డ్ టీచర్ల ఎదురుచూపులు!

- **20 మంది ఉపాధ్యాయుల సమస్యపై ఎమ్మెల్సీకి వినతి**

**వరంగల్ విజయ కెరటం అక్టోబర్ 30:**



పదవీ విరమణ చేసి నెలలు గడుస్తున్నా యూనిక్ ఐడీలు కేటాయించకపోవడంతో ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలల రిటైర్డ్ ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించి పెండింగ్‌లో ఉన్న 20 మంది ఉపాధ్యాయులకు తక్షణమే యూనిక్ ఐడీలు మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డికి పలువురు రిటైర్డ్ ఉపాధ్యాయులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ..మార్చి 2024 నుంచి సెప్టెంబర్ 2025 వరకు పదవీ విరమణ పొందిన వరంగల్ జిల్లాకు చెందిన 54 మంది ఎయిడెడ్ ఉపాధ్యాయుల వివరాలను విద్యాశాఖ అధికారులు సంబంధిత డీఎస్సీకి పంపించగా, జనవరి 2026లో కేవలం 34 మందికి మాత్రమే యూనిక్ ఐడీలు కేటాయించారని ఉపాధ్యాయులు తెలిపారు. మిగిలిన 20 మందికి ఇప్పటికీ ఐడీలు మంజూరు కాకపోవడంతో తమ బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.యూనిక్ ఐడీలు లేకపోవడంతో ఈఎల్స్, పీఆర్సీ, డీఏ బిల్లులను డీఈఓ కార్యాలయం ద్వారా డీటీఓకు సమర్పించలేకపోతున్నామని, ఎంఈఓ, డీఈఓ కార్యాలయాల్లోనూ బిల్లులు స్వీకరించడం లేదని పేర్కొన్నారు. ఆరు నెలలుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సమస్యకు పరిష్కారం లభించడం లేదని వాపోయారు.వయోభారంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న రిటైర్డ్ ఉపాధ్యాయులు వివిధ ప్రాంతాల నుంచి సచివాలయానికి పలుమార్లు వెళ్లి అధికారులకు తమ సమస్యను వివరించినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్సీ జోక్యం చేసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయులందరికీ యూనిక్ ఐడీలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఆకుతోట శ్రీనివాస్, డాక్టర్ వేణుమాధవ్, జటబోయిన స్వామి, ఎం. కుమారస్వామి, యర్ర రవికుమార్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విజయకెరటం
తెలుగు దినపత్రిక

## సాగునీటి కాలువ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

- బ్రహ్మణ వెల్లంల--ఉదయ సముద్రం పనులపై అధికారులతో సమీక్షించిన గుత్తా సుఖేందర్ రెడ్డి



**నల్లగొండ, అక్టోబర్ 30 (విజయ కెరటం):**

బ్రహ్మణ వెల్లంల--ఉదయ సముద్రం కాలువ పనులను ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలోని తన నివాసంలో ఇరిగేషన్ శాఖ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈ, ఎస్ఈ, ఈఈ, డీఈ తదితర అధికారులను పనుల ప్రస్తుత పరిస్థితి, ఇప్పటివరకు సాధించిన పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. కాలువ పనుల వేగవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

## నల్గొండ బత్తాయి మార్కెట్‌లో ఐకేపీ కొనుగోలు కేంద్రం ప్రారంభం

**నల్గొండ (విజయ కెరటం):**



నల్గొండ ఎస్ఎల్‌బీసీ బత్తాయి మార్కెట్‌లో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బైరెడ్డి హేమలత వెంకట్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ సెక్రటరీ సీహెచ్. శ్రీనాథ్ రాజు, 9వ డివిజన్ కార్పొరేటర్ బాణావత్ దీప్లా నాయక్, టౌన్ యూత్ వైస్ ప్రెసిడెంట్ వజ్జ శ్రీనివాస్ యాదవ్, ఎంఏఓ ఎస్. శ్రీనివాస్, ఏఈఓ అబ్దుల్ వాసే సత్తార్ పాల్గొన్నారు.అలాగే వార్డు ముఖ్య నాయకులు కందుల నరేందర్, కన్నెబోయిన రమేష్, గోపగోని నర్సింహా, జల్లెల శ్రీనివాస్, చిన్నాల ఆంజనేయులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

## బీజేపీపై కాంగ్రెస్ సమరభేరి!

**ఓటు బచావో.. దేశ్ బచావో నినాదంతో ఢిల్లీకి హనుమకొండ నేతలు**

**వరంగల్ విజయ కెరటం అక్టోబరు 30 :**



ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిరక్షణే లక్ష్యంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ సమరానికి సిద్ధమైంది. నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో 'ఓటు బచావో.. దేశ్ బచావో' నినాదంతో నిర్వహించనున్న మహా ర్యాలీకి కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తదితరులు హాజరుకానున్నారు.ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు, ఓటర్ల జాబితాల్లో అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వంతో పాటు ఎన్నికల సంఘం తీరును ప్రశ్నిస్తోంది. ఓటు హక్కు పరిరక్షణకు ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని డిమాండ్ చేస్తోంది. బీజేపీ ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం దేశవ్యాప్త ఉద్యమానికి కాంగ్రెస్ పిలుపునిచ్చింది.ఈ నేపథ్యంలో హనుమకొండ జిల్లా నుంచి టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అర్షం అశోక్, మడికొండ శ్రీను, యువజన కాంగ్రెస్ నాయకులు వెలకంటి వరుణ్, బొజ్జం సాయి తదితరులు చలో ఢిల్లీ కార్యక్రమానికి తరలివెళ్తున్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న ఈ మహా ర్యాలీలో జిల్లా కాంగ్రెస్ నాయకులు భాగస్వాములు కానున్నారు.

## 'అదుర్స్' బామ్మ ఇక లేరు.. సీనియర్ నటి వత్సల రాజగోపాల్ కన్నుమూత

**వయోభార అనారోగ్యంతో చెన్నైలో వత్సల రాజగోపాల్ తుదిశ్వాస**

**'అదుర్స్' చిత్రంలో ఎన్టీఆర్ బామ్మగా తెలుగువారికి సుపరిచితం**

**400కు పైగా చిత్రాలు, పలు టీవీ సీరియళ్లలో నటన**

ప్రముఖ దక్షిణాది సీనియర్ నటి వత్సల రాజగోపాల్ (92) చెన్నైలో కన్నుమూశారు. గత కొంతకాలంగా వయోభార సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆమె మృతితో సినీ పరిశ్రమలో విషాదఛాయలు అలుముకున్నాయి.నాటకరంగంలో విశేష గుర్తింపు పొందిన వత్సల, తన 60 ఏళ్ల వయసులో ప్రముఖ దర్శకుడు మణిరత్నం తెరకెక్కించిన 'రోజా' చిత్రంతో వెండితెరపై అడుగుపెట్టారు. ఆ తర్వాత తమిళం, తెలుగు భాషల్లో 400కు పైగా చిత్రాల్లో నటించి తనదైన ముద్ర వేశారు. ముఖ్యంగా తెలుగు ప్రేక్షకులకు ఆమె సుపరిచితురాలే. జూనియర్ ఎన్టీఆర్ హీరోగా వచ్చిన 'అదుర్స్' చిత్రంలో బామ్మ పాత్రలో ఆమె నటనకు మంచి మార్కులు పడ్డాయి.బామ్మ పాత్రలైనా, ఇతర సహాయక పాత్రలైనా వాటికి సహజత్వాన్ని అద్దడంలో ఆమె దిట్ట. సినిమాలతో పాటు పలు టీవీ సీరియళ్లలోనూ నటించి బుల్లితెర ప్రేక్షకులకు చేరువయ్యారు. వత్సల రాజగోపాల్ మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు, నటీనటులు సంతాపం వ్యక్తం చేస్తూ ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. చెన్నైలోని పల్లావరంలో ఉన్న ఆమె నివాసంలో భౌతికకాయాన్ని సందర్శనార్థం ఉంచారు. శుక్రవారం సాయంత్రం క్రోమ్‌పేటలోని శ్మశానవాటికలో ఆమె అంత్యక్రియలు జరగనున్నాయి.



# మిర్యాలగూడలో రైస్ మిల్లులు, బియ్యం దుకాణాల్లో తనిఖీలు.. 8 కేసులు నమోదు





**మిర్యాలగూడ, అక్టోబర్ 30 (విజయ కెరటం):**

మిర్యాలగూడ పట్టణంలోని రైస్ మిల్లులు, బియ్యం విక్రయ దుకాణాల్లో లీగల్ మెట్రాలజీ (తూనికలు, కొలతల శాఖ) అధికారులు తనిఖీలు నిర్వహించారు. అసిస్టెంట్ కంట్రోలర్ పర్యవేక్షణలో జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి ఈ తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా ఐదు రైస్ మిల్లులు, మూడు రిటైల్ బియ్యం దుకాణాలను తనిఖీ చేయగా, నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి మొత్తం 8 కేసులు నమోదు చేశారు. ఇందులో రైస్ మిల్లులపై 5, రిటైల్ బియ్యం దుకాణాలపై 3 కేసులు ఉన్నాయి.ఈ సందర్భంగా అధికారులు వినియోగదారులకు పలు సూచనలు చేశారు. బియ్యం కొనుగోలు సమయంలో బస్తాపై ప్రకటించిన నికర బరువును పరిశీలించాలని, బస్తా బరువును మినహాయించి బియ్యం అసలు బరువును తూకం వేయించుకోవాలని సూచించారు. ప్రకటించిన బరువుకు అనుగుణంగా బియ్యం ఉన్నాయో లేదో నిర్ధారించుకున్న తర్వాతే కొనుగోలు చేయాలన్నారు.తూకంలో తేడాలు లేదా ఇతర ఉల్లంఘనలు గుర్తిస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు. వ్యాపారులందరూ తూనికలు, కొలతల చట్టం, ప్యాకేజ్డ్ కమోడిటీస్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.



# 9వ నెలలోనూ సమంత వర్కౌట్లు.. ప్రెగ్నెన్సీ ఫిట్‌నెస్ జర్నీ వీడియో వైరల్!



**తొమ్మిదో నెల గర్భంతో ఉన్న నటి సమంత**

**తన ఫిట్‌నెస్ జర్నీని చూపిస్తూ సోషల్ మీడియాలో వీడియో షేర్**

**'9. ది ఫైనల్ ల్యాప్' అంటూ పోస్ట్ చేసిన సామ్**

**శరీరం చెప్పేది వింటూ వర్కౌట్లు చేస్తున్నానన్న సమంత**

ప్రముఖ నటి సమంత ప్రస్తుతం తన ప్రెగ్నెన్సీలో చివరి దశను ఆస్వాదిస్తున్నారు. త్వరలోనే పండంటి బిడ్డకు జన్మనివ్వబోతున్న ఆమె, గర్భంతో ఉన్నప్పటికీ తన ఫిట్‌నెస్ పట్ల ఏమాత్రం రాజీ పడటం లేదు. తాజాగా తొమ్మిదో నెలలోకి అడుగుపెట్టిన సందర్భంగా తన గర్భధారణ ప్రయాణంలో ఫిట్‌నెస్ ఎంత ముఖ్యమో తెలియజేస్తూ ఒక స్ఫూర్తిదాయక వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. 'చ9. ది ఫైనల్ ల్యాప్' (చివరి అంకం) అనే క్యాప్షన్‌తో ఆమె చేసిన ఈ పోస్ట్ ఇప్పుడు వైరల్ అవుతోంది.ఈ వీడియోలో సమంత తన గర్భం దాల్చిన మొదటి నెల నుంచి తొమ్మిదో నెల వరకు వివిధ దశల్లో చేసిన వర్కౌట్లను చూపించారు. ముఖ్యంగా, లేటెస్ట్ క్లిప్‌లో ఆమె ఛాతీకి దగ్గరగా డంబెల్ పట్టుకుని వెయిటెడ్ స్క్వాట్స్ చేయడం అందరినీ ఆకట్టుకుంటోంది. గర్భం కారణంగా తన శరీరం మార్పులకు అనుగుణంగా వ్యాయామ దినచర్యను ఎలా మార్చుకున్నారో సమంత గతంలోనే వివరించారు."ఈ రోజుల్లో ట్రైనింగ్ కాస్త భిన్నంగా ఉంది. ఎక్కువగా శ్రమించడం కంటే, శరీరం చెప్పేది వినడంపైనే ఎక్కువ దృష్టి పెడుతున్నాను" అని ఆమె గతంలో ఒక వర్కౌట్ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇప్పుడు ఆమె షేర్ చేసిన వీడియో కూడా అదే విషయాన్ని స్పష్టం చేస్తోంది.కాగా, సమంత తన భర్త, ప్రముఖ ఫిల్మ్‌మేకర్ రాజ్ నిడిమోరుతో కలిసి తమ తొలి బిడ్డకు స్వాగతం పలకనున్నారు. కొద్ది వారాల క్రితం, ఈ జంట కోయంబత్తూరులోని సద్గురు ఈశా ఫౌండేషన్‌లో తమ కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య సంప్రదాయబద్ధంగా సీమంతం వేడుకను జరుపుకున్నారు. సమంత, రాజ్ 2025 డిసెంబర్‌లో ఇదే ఈశా యోగా సెంటర్‌లోని లింగ భైరవి ఆలయంలో వివాహం చేసుకున్న విషయం తెలిసిందే.సమంత పోస్ట్‌పై నటి కృతి కర్బందా స్పందిస్తూ.. "మీ ముగ్గురికీ నా ప్రేమ" అంటూ కామెంట్ చేశారు. సమంత ఫిట్‌నెస్ స్ఫూర్తిపై అభిమానులు, తోటి నటీనటులు ప్రశంసలు కురిపిస్తున్నారు. గర్భంతో ఉన్నప్పటికీ చురుకుగా ఉంటూ ఎంతో మందికి ఆమె ఆదర్శంగా నిలుస్తున్నారు.

Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528